క్లుప్తంగా

భగవద్గీత మోక్ష ప్రదాయిని



భగవద్గీత గొప్పతనం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, ప్రతిఒక్కరూ భగవద్గీత చదివి మోక్షం పొందాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదళ గీతామందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్కరూ తమ జీవితాన్ని క్షణం తీరిక లేకుండా గడపడంతో మానసిక ప్రశాంతత లేకుండా పోతోందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, అందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ చేస్తున్న వాసవీ క్లబ్ వనితాశక్తి ప్రెసిడెంట్ శ్రీదేవి తదితరులు

రాజాం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పురస్కరించుకుని, స్థానిక పట్టణంలోని తెలగవీధిలో రాజాం వాసవీ క్లబ్ వనితా శక్తి ఆధ్వర్యంలో సోమవారం గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గోపూజ గొప్పతనం, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనితాశక్తి ప్రెసిడెంట్ పొట్నా శ్రీదేవి, కార్యదర్శి బండి అరుణకుమారి, కోశాధికారి ఆర్.కన్యాకుమారి పాల్గొన్నారు.

దుస్తుల అందజేత



అందుకున్న వస్త్రాలతో చిన్నారులు

బొబ్బిలి రూరల్: మండలంలోని చిలకమ్మవలస గిరిజన గ్రామంలోని పలువురు నిరుపేద చిన్నారులకు గాంధీ స్మారక నిధి సభ్యులు సోమవారం దుస్తులు అందజేశారు. పాతబొబ్బిలిలోని మెర్సీవాల్ వద్ద సేకరించిన వస్త్రాలను ఇలా అందిస్తున్నామని సభ్యులు తెలిపారు. ప్రస్తుతం బట్టలతో పాటు పండ్లు, కూరగాయలు కూడా అందించామన్నారు. కార్యక్రమంలో గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు మింది విజయమోహన్, వనమిత్ర కృష్ణదాస్, గంటేడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



మురుగుకాలువలోని పూడికలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఒమ్మి, నందబలగ, గుయ్యానవలస తదితర గ్రామాల్లో సోమవారం జరిగిన పారిశుధ్య పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. పంచాయతీ సాధారణ నిధులతో ఈ పనులు చేయిస్తున్నామని, ప్రజారోగ్యమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో తెలిపారు.

పశువులకు 'గాలికుంటు' నివారణ టీకాలు



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న గ్రామ పశు సంవర్ధక సహాయకురాలు

తెర్లాం: మండలంలోని లింగాపురం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు సోమవారం వేశారు. మండల పశువైద్య అధికారి జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో గ్రామ పశుసంవర్ధక సహాయకురాలు రైతుల వద్దకు వెళ్లి, వారి దగ్గరున్న పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేశారు. ఈ సీజన్‌లో ఎక్కువగా పశువులకు ఈ వ్యాధి సోకుతుందని, ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా అన్ని గ్రామాల్లోని పశువులకు టీకాలు వేస్తున్నామని పశువైద్యాధికారి తెలిపారు.

నేడు గ్రామసభ

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస పంచాయతీ పరిధిలోని రాచ్చేరువలస గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సభకు మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.



ప్రాణాలు రక్షించే వారికే రక్షణ లేదు..

ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వారికే ప్రస్తుతం రక్షణ లేదు. దేశవ్యాప్తంగా ఎక్కడపడితే అక్కడ వైద్యులు, సిబ్బందిపై నిత్యం దాడులు జరుగుతూనే ఉండడం చాలా విచారకరం. నిందితులకు కఠినమైన శిక్షలు అమలు చేస్తేనే మరెన్నడూ ఆ తరహా ఘటనలు పునరావృతం కావు. వైద్యారోగ్య సిబ్బంది భద్రతకు ప్రత్యేక చట్టాలు రూపొందించి, అమలు చేయాలి.

– జి.యోగీశ్వరి, ఆరోగ్య కార్యదర్శి, పెనుబాక, రాజాం మండలం



పని ప్రదేశంలో ఒత్తిడి ఉండరాదు..

పని ప్రదేశంలో ఏ ఒక్కరి నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండకూడదు. అప్పుడే చక్కగా పనిచేయగలుగుతాం. ఓ వైపు ఆస్పత్రిలో మరోవైపు క్షేత్రస్థాయిలో పనిచేసేటప్పుడు కూడా కొంతమంది ఆకతాయిల నుంచి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజలకు నిరంతర సేవ లందించే తమకు భయం లేకుండా పనిచేసుకునే ధైర్యాన్ని కల్పించాలి.

– వై.స్వాతి, ఆరోగ్య కార్యదర్శి, రాజయ్యపేట, రాజాం మండలం



వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



రాజాం: చీపురుపల్లి రోడ్డులోని నిర్మల ఆయిల్‌మిల్లు వద్ద శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు

వాడవాడలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రావణమాసంలోని కృష్ణపక్షంలో వచ్చే అష్టమ తిథి నాడు ఈ ఉత్సవాలు జరుపుకుంటుండడం ఆనవాయితీగా వస్తోంది. వేకువజామున తలస్నానం చేసి, ఆలయాలకు చేరుకున్న భక్తులు కృష్ణ భగవానుడికి విశేష పూజలు చేశారు. అనంతరం కన్నయ్యకు ప్రీతికరమైన పాలు, వెన్న, పండ్లను నైవేద్యంగా సమర్పించి, భగవద్గీత పఠించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు గోపికాకృష్ణుల వేషధారణలతో సందడి చేయగా, ఉట్టికొట్టే వేడుకలో యువత పాల్గొని, అలరించారు.

– బొబ్బిలి, రాజాం



రాజాం: బుచ్చింపేటలో ప్రత్యేకాలంకరణలో శ్రీకృష్ణుడు



రేగిడి: కొమెరలో గోపికాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



రాజాం సిటీ: కృష్ణ మందిరంలో భక్తుల పూజలు



బొబ్బిలి: మండల కేంద్రంలో డీఎస్పీ శ్రీనివాసరావుకు శ్రీకృష్ణుడి లీలలు అనే పుస్తకాన్ని బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



సంతకవిటిలో పూజలందుకున్న రాధాకృష్ణులు



రామభద్రపురంలో గ్లోబల్ వ్యూ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న బాలుడు



తెర్లాం: మండల కేంద్రంలో గోపికాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



రామభద్రపురం: పాతరేగలో శ్రీకృష్ణుడి ప్రతిమ వద్ద పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని పూల్‌బాగ్‌లో ఉన్న గీతామందిరంలో నృత్యం చేస్తున్న చిన్నారులు, మహిళలు



బొబ్బిలి రూరల్: వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మహిళల కోలాటం

షటిల్ బ్యాడ్మింటన్ విజేత 'రేగిడి'



ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారితో యూటీఎఫ్ నాయకులు

రాజాం సిటీ: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయుల మధ్య నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా రేగిడి ఉపాధ్యాయుల జట్టు నిలిచింది. స్థానిక జీఎంఆర్ ఐటీ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీలను వైద్యుడు గార రవిప్రసాద్ ప్రారంభించారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన మొత్తం 32 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలో రేగిడి మండలానికి చెందిన వై.కిశోర్, వి.సత్యంనాయుడులు ప్రథమ స్థానంలో, జి.సింహాచలం, కె.హరిబాబులు ద్వితీయ స్థానంలో నిలిచారని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వాసు తెలిపారు.

మదర్ థెరీసా సేవలు ప్రశంసనీయం



మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

రాజాం సిటీ: నిస్వార్థ సేవకురాలు మదర్ థెరీసా సేవలు ప్రశంసనీయమని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కొనియాడారు. స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో మదర్ థెరీసా జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనదేశం కాకపోయినా మనదేశ ప్రజలకు నిస్వార్థంగా ఆమె సేవలందించి, ఆమెలోని మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. ఆమె సేవలను స్ఫూర్తిగా తీసుకుని, యువతీయువకులు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, బూరాడ శివకృష్ణ, మక్క అప్పలనాయుడు, విశ్రాంత ఎంఈవో బి.పంచముఖేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



సీఐ సతీష్‌కుమార్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న వీరబొబ్బిలి స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు

బొబ్బిలి: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సీఐ కె.సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనను వీరబొబ్బిలి స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు రావు శ్రీనివాసరావు, తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి వచ్చిన క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ అని, క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. నచ్చిన క్రీడలో నైపుణ్యం సాధించి, తద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్యనభ్యసించేందుకు సీట్లు, ఉద్యోగాలు కూడా వస్తున్నాయన్న విషయం మర్చిపోవద్దన్నారు.

గంజాయి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: పట్టణంతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ అన్ని ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయనున్నామని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, వినియోగించినా వివరాలు తెలియజేయాలన్నారు. రాజాంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణకు కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. పెద్దపెద్ద సౌండ్స్‌తో పాటలు పెట్టి ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఆటోడ్రైవర్లు వ్యవహరించాలని సూచించారు. అలాగే రోడ్లపై ఆటోలు, తోపుడుబళ్లు నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రాత్రి 10 గంటల తర్వాత పాన్‌షాపులు తెరవకూడదని, రాత్రి 10 గంటల తర్వాత అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి సమయంలో రోడ్లపై పుట్టిన రోజు వేడుకలు చేయకూడదన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

బొబ్బిలి: స్థానిక ఆర్‌సీఎం స్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. 1999–2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి తమ తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఫాదర్ ఎస్.ప్రతాప్ మాట్లాడుతూ ఉత్తమ జీవన విధానాలు అవలంబిస్తూ ఆదర్శవంతంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ ఒమ్మి మోహన్, ఆనాటి ఉపాధ్యాయులు రాజమోహన్, రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేట, ఐటీఐ, ఇందిరమ్మ కాలనీలు, గ్రోత్ సెంటర్, రాజమహల్ తదితర ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. గ్రోత్ సెంటర్‌లోని సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడి పరిధిలోని శీరబంద వద్ద ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 58 మద్యంసీసాలను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలింపుపై అందుకున్న ముందస్తు సమాచారం మేరకు దుప్పలపూడి వద్ద మాటువేయగా ఇదే మండలంలోని ఇట్లామామిడిపల్లి గ్రామానికి చెందిన మాదేటి వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని, మద్యంసీసాలను పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.ప్రసాదరావు తెలిపారు.

అనుమతుల్లేకుండా విక్రయాలు తగదు..

డెంకాడ: అనుమతుల్లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని అయినాడ జంక్షన్, జొన్నాడ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, గుట్కాలు వంటి నిషేధిత పదార్థాలను విక్రమించినా, రవాణా చేసినా.. మందుగుండు విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన చర్యలు తప్పవన్నారు. అనంతరం నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ చలాన్‌లు విధించారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న న్యాయవాది రామ్మూర్తినాయుడు

వంగర: మండలంలోని బాగెంపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని రాజాం ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది, వీఎస్‌ఏ కమిటీ అధ్యక్షుడు రెడ్డి రామ్మూర్తినాయుడు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా సామాజిక అభివృద్ధి కమిటీ సేకరించిన విరాళాలతో నిర్మించిన ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంపిటేటివ్‌కు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని ఎంతగా ఉపయోగించుకుంటే అంత మంచిదన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి గంటా వల్లభనాయుడు, న్యాయవాది రెడ్డి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోడిపంట సాగుపై అవగాహన



చోడిపంట సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని మునకలవలస, కొర్లవలస, బూరాడ, సోమరాజుపేట, అంబకండి, రేగిడి తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు చోడిపంట సాగుపై సోమవారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ చోడి(రాగి)పంటకు మంచి డిమాండ్ ఉందని, చోడిపిండితో తయారయ్యే పదార్థాలతో మంచి ఆరోగ్యం లభిస్తుండడంతో అందరూ కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆ పంట పండించుకుంటే ఆర్థికంగా వృద్ధి సాధించవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే ఇటువంటి పంటల సాగుకు రైతులు ముందుకురావాలన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



పణుకువలసలో వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం



రాజాంలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని పణుకువలస గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ నీలిమ ఆదేశాల మేరకు సర్పంచ్ చందక సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వీధుల్లో ఉన్న కాలువల్లోను, ఖాళీ ప్రదేశాల్లోనూ దోమలు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ మందును సోమవారం స్ప్రే చేయించారు. వర్షాల నేపథ్యంలో నీటి నిల్వల్లో దోమలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు.

ఫాగింగ్..

రాజాం: పట్టణంలోని అన్ని వార్డుల్లో సోమవారం ఫాగింగ్ చర్యలు చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగునీటి నిల్వల వద్ద దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. విడతల వారీగా పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ ఫాగింగ్ చేస్తున్నామన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయని, వాటి నుంచి ప్రజలను కాపాడేందుకే పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయడంతో పాటు ఫాగింగ్ చేపడుతున్నామన్నారు.

సంగీతార్చనతో కృష్ణాష్టమి వేడుకలు

విజయనగరం టౌన్: నగరంలోని కొత్త అగ్రహారంలో ఉన్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం సంగీతార్చనలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూలతో అలంకరించి, పూజలు చేశారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు వంశీకృష్ణ, రవికుమార్, మహేశ్వరరావు, భానుహర్ష, శిరీష, శారద, బాలాజీస్వామి, నిర్మల, తదితరులు ప్రదర్శనలను పర్యవేక్షించారు. విద్యార్థులు అనన్య, సాహితీ, ప్రణతి, శ్రీనిధి, రమ్య, రాహిత్య, దేవవర్ధన్, సాయి జ్యోత్స్న, తనూజశ్రీ, నక్షత్ర, తదితరులు గాత్రం, వయోలిన్‌లో ప్రదర్శనలివ్వగా మహేశ్వరరావు మృదంగంపై సహకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.